క్లుప్తంగా

గంగానమ్మకు ఆషాఢం సారె



అమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తులు

దెందులూరు: గాలాయగూడెం గ్రామంలో గురువారం శ్రీగంగానమ్మకు గాలాయగూడెం గ్రామస్తులు ఆషాఢం సారెను సమర్పించారు. భక్తులు అమ్మవారి ఆలయ ప్రదక్షిణలు నిర్వహించి గంగానమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గంగానమ్మకు 50 రకాల ఆషాఢం సారె సమర్పించారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

గ్రామాల్లో ఫీవర్ సర్వే



ఫీవర్ సర్వేలు చేస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: గ్రామాల్లో ఫీవర్ సర్వే జరుగుతుందని గృహాల యజమానులు వైద్య సిబ్బందికి సహకరించాలని గోపన్నపాలెం వైద్యశాల డాక్టర్ రాకేష్, డాక్టర్ రోజ్ మేరీ కోరారు. ఎటువంటి అనారోగ్య లక్షణాలు గుర్తించినా ఇళ్లకు వచ్చే వైద్య సిబ్బందికి దాపరికం లేకుండా తెలియజేయాలన్నారు. సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణకు వైద్యులు వైద్య సిబ్బంది చేస్తున్న కృషికి ప్రజలు కూడా తమ వంతు తోడ్పాటు అందించాలన్నాలన్నారు. గురువారం గ్రామాల్లో జరుగుతున్న ఫీవర్ సర్వేను ఎంపీహెచ్ఓ సత్యనారాయణ పరిశీలించారు.

చర్చి వార్షికోత్సవం నిర్వహణ



సువార్తీకులు ప్రసాద్‌ను సన్మానిస్తున్న చర్చి వ్యవస్థాపకులు

దెందులూరు: మసీదుపాడు వీఎల్‌జీఎం చర్చి 3వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. వీఎల్‌జీఎం వ్యవస్థాపకులు పాస్టర్ డాక్టర్ సిల్వర్ట్ కుమార్ ఆధ్వర్యంలో సువార్తీకులు డాక్టర్ ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. గ్రామ శివారు ప్రాంతాల్లో ఆధ్యాత్మిక అభివృద్ధికి సంఘాల ఐక్యత, బలోపేతానికి వీఎల్‌జీఎం చర్చి వ్యవస్థాపకులు డాక్టర్ సిల్వర్ట్ కుమార్ చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. వేడుకల్లో విశ్వాసులు, యువత, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత



డ్రైవర్‌కు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష చేస్తున్న పోలీసులు

జంగారెడ్డిగూడెం: పాఠశాలలు కాలేజీ బస్సుల డ్రైవింగ్‌లో సురక్షితంగా ఉండేందుకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నట్టు డీఎస్పీ యు.రవిచంద్ర తెలిపారు. గురువారం స్థానిక సీఐ ఎం.సుభాష్ ఆధ్వర్యంలో ఎస్సై షేక్ జబీర్, ట్రాఫిక్ ఎస్సై కుటుంబరావులు సిబ్బందితో కలిసి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఆటోలు, స్కూల్, కాలేజీ బస్‌ల్లో విద్యార్థుల భద్రతపై ప్రత్యేక దృష్టి సాధించినట్లు తెలిపారు. డ్రైవర్‌లు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నారన్న సమాచారంతో ఈ తనిఖీ చేస్తున్నట్టు చెప్పారు. మద్యం సేవించి వాహనాలను నడపడం అంటే నడిపే వారికే కాకుండా ఇతరుల జీవితాలతో చెలగాటం ఆడటమే అన్న సందేశాన్ని డ్రైవర్లకు తెలియజేశారు. సీఐ సుభాష్ మాట్లాడుతూ పిల్లల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం పోలీస్ శాఖ ప్రధాన కర్తవ్యమని, డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

19న హనుమాన్ చాలీసా మహాయజ్ఞం

దెందులూరు: ఈ నెల 19న హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో హనుమాన్ చాలీసా మహాయజ్ఞం జరుగుతుందని బ్రాహ్మణ సేవా సంఘం ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు పెనుమాక వాసుదేవరావు అన్నారు. 1108 గొంతుకలతో భక్తితో ఒకే సంకల్పంతో ఏకకాలంలో జరిగే హనుమాన్ చాలీసా మహాయజ్ఞంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆయన కోరారు. గురువులు, ప్రవచన కర్తలు, గోరక్షకులు, భక్తులు మహారథుల సమక్షంలో ఈ వేడుక నిర్వహిస్తారని వాసుదేవరావు తెలిపారు.

విద్యుత్ డీఈ బాధ్యతల స్వీకరణ

ఉంగుటూరు: ఉంగుటూరు విద్యుత్ శాఖ డీఈగా రాళ్లపల్లి భీమేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు. గురువారం ఉంగుటూరు విద్యుత్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఆ పోస్టులో పనిచేసిన ఎస్.శ్రీనివాసరావు అమలాపురం డీఈగా బదిలీపై వెళ్లారు. ఏఈలు, ఇతర విద్యుత్ సిబ్బంది భీమేశ్వరరావును కలిసి అభినందనలు తెలిపారు. ఏఈగా పనిచేసిన చోట డీఈగా రావడం ఆనందంగా ఉందని భీమేశ్వరావు తెలిపారు.

బీసీలపై దాడులు అమానుషం

- కూటమి పాలనలో పెరిగిన దాడులు
- ఉప్పల హారికకు బీసీల మద్దతు
- పోరాటానికి సిద్ధమంటున్న బీసీ సంఘాల నేతలు



జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు(ఫైల్)

దెందులూరు: బీసీ నాయకులు ప్రజా ప్రతినిధులు ముఖ్య నేతలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు అక్రమ కేసులపై బీసీ సంఘాలు బీసీ ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా స్వామ్యంలో దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు రాణించవన్నారు. ఒక జిల్లాకు చైర్‌పర్సన్‌గా ఉన్న బీసీ మహిళను టార్గెట్ చేసి కారులోనే దౌర్జన్యం చేసి, దాడి చేస్తే వాటి వెనుక ఆంతర్యం ఏమిటని బీసీ ప్రజా ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. త్వరలోనే రాష్ట్ర బీసీ సంఘం సమావేశం భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్ణయిస్తామని చెబుతున్న ప్రజా ప్రతినిధులు తమ అభిప్రాయాన్ని వారి మాటల్లోనే వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌పై దాడి.. బీసీలపై జరిగిన దాడి



కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై జరిగిన దాడిని బీసీలపై దాడిగా పరిగణిస్తున్నాం. మహిళ అని కూడా చూడకుండా చేసిన దాడి రాష్ట్ర ప్రజలు చూశారు. ఇలాంటి సంఘటన గతంలో ఎన్నడూ జరగలేదు. ఈ సంఘటన తీవ్రంగా పరిగణిస్తున్నాం.

–ముదుగురు సూర్యనారాయణ, వై ఎస్సార్ సీపీ బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

చైర్‌పర్సన్ కుటుంబానికి అండగా ఉంటాం



రాష్ట్రంలోని గౌడ వర్గీయులు జెడ్పీ చైర్‌పర్సన్ హారికకు మద్దతు ఇస్తున్నాం. ఆ కుటుంబానికి అండగా ఉంటాం. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. ఇది అత్యంత దుర్మార్గమైన చర్య.

–మేక లక్ష్మణరావు, వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు

దాడి చేసిన వారిపై చర్యలేవి?



రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌పై జరిగిన దాడిలో ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. జెడ్పీ చైర్‌పర్సన్ భర్తపై కేసు నమోదు చేయడం కొత్త రాజకీయ కోణం. జెడ్పీ చైర్‌పర్సన్‌కు రక్షణ లేకపోతే రాష్ట్రంలో సామాన్యులకు రక్షణ ఎక్కడ ఉంటుంది.

–కట్టా ఏసుబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర గ్రీవెన్స్ కార్యదర్శి

మహిళలపై దాడి సిగ్గుచేటు



మహిళలపై దాడి చేయటం సిగ్గుచేటు జెడ్పీ చైర్‌పర్సన్ హోదాలో ఉన్న ప్రజా ప్రతినిధిపై పట్టపగలు దాడి, దౌర్జన్యం చేశారంటే అర్థం ఏమిటి. మహిళలు ఉప్పల హారికకు మద్దతు ఇస్తున్నాం వారి కుటుంబానికి అండగా ఉంటాం.

–తాతా రమ్యశ్రీ, ఎంపీపీ పెదవేగి

గ్రామీణ మార్కెట్‌తో తీరనున్న సంత చింత



భీమడోలు సంత మార్కెట్ వద్ద నిర్మించిన షెడ్లు



నాబార్డు నిధులతో నిర్మించిన టాయిలెట్లు



రోడ్డుపై సంత నిర్వహించడంతో స్తంభించిన ట్రాఫిక్

- నాబార్డ్ నిధులతో హెడ్లు, టాయిలెట్ల నిర్మాణం
- వైఎస్సార్ సీపీ హయాంలో నిధులు మంజూరు
- నేడు ప్రారంభం

భీమడోలు: భీమడోలు వాసుల చిరకాల వాంఛ నెరవేరనుంది. దశాబ్దాలుగా సంత మార్కెట్ నిర్వహణ, రైతులు గిట్టుబాటు ధర పొందేందుకు పడుతున్న ఇబ్బందులు తొలగనున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు మద్దతుగా వారి ఉత్పత్తులకు మంచి ధర కలిగించేందుకు నాబార్డ్ గ్రామీణ సంత పేరుతో షెడ్లు నిర్మించేందుకు అవసరమైన నిధులు మంజూరు చేసింది. నాబార్డ్ ఆధ్వర్యంలో జిల్లాలో తొలిసారిగా భీమడోలులో గ్రామీణ సంతకు రూ.15 లక్షల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో రెండు షెడ్లతో పాటు టాయిలెట్లు, ఆఫీసులను సుందరంగా తీర్చిదిద్దారు. భీమడోలులో సరైన మార్కెటింగ్ సదుపాయం లేకపోవడంతో రైతులు, ప్రజలు పడుతున్న కష్టాలను వైఎస్సార్ సీపీ గ్రామ సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్ దంపతులు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు దృష్టికి తీసుకెళ్లారు. నిధుల మంజూరుకు మాజీ ఎమ్మెల్యే వాసుబాబు చేసిన కృషి ఫలించింది. దీంతో వైఎస్సార్ సీపీ హయాంలో నిధులు మంజూరు కాగా గతేడాది మార్చిలో అప్పటి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఈ పనులకు శంకుస్థాపన చేశారు. నాబార్డ్ నిధులతో భీమడోలులోని చైతన్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాము మాన్‌సింగ్ షెడ్లతో పాటు మౌలిక వసతులను నిర్మించారు. దీంతో ఆ మార్కెట్ ప్రాంతం ఆహ్లాదకరంగా మారింది. సంత మార్కెట్ వద్ద ట్రాఫిక్ సమస్యలు తీరుతాయి. అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. ఈ షెడ్లను ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, రాష్ట్ర చైర్మన్ గన్ని వీరాంజనేయులు చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభిస్తారు.

ఆదర్శంగా మారనున్న గ్రామీణ మార్కెట్

భీమడోలులో ప్రతి బుధవారం వారపు సంత నిర్వహిస్తారు. 50 గ్రామాలకు చెందిన వేలాది మంది గ్రామీణ ప్రాంత ప్రజలు కూరగాయాలు, ఆకు కూరలు, ఇతర పండ్లు తదితర ఉత్పత్తులను అధిక ధరలకు కొనుగోలు చేసుకునే దుస్థితి ఏర్పడింది. దీంతో దళారుల రాజ్యమేలడంతో రైతులకు గిట్టుబాటు ధర లేకపోవడం, సరుకు నాణ్యత లేకపోయినా వినియోగదారులు అధిక ధరలకు వాటిని కొనుగోలు చేస్తున్నారు. అటు రైతులు, ఇటు ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామీణ మార్కెట్ వలన నేరుగా రైతుల నుంచి వాటిని కొనుగోలు చేసుకునే అవకాశం ఏర్పడుతుంది. అదే విధంగా ఇకపై ప్రతి రోజూ రైతులు పండించిన ఉత్పత్తులను ఈ షెడ్ల వద్ద విక్రయించేందుకు అనుకూలంగా ఏర్పాట్లు చేశారు. దీంతో భీమడోలు పరిసర గ్రామాలకు చెందిన భీమడోలు, ద్వారకాతిరుమల, దెందులూరు మండలాల పరిధిలోని రైతులకు మేలు కలుగుతుంది. ఈ షెడ్ల నిర్మాణంతో రైతులకు నేరుగా మార్కెట్ అందుబాటులోకి వచ్చి, వారి ఆదాయం పెంచుకునేందుకు దోహద పడుతుంది. ఇప్పటి వరకు సరైన మార్కెట్ లేకపోవడంతో ఏన్నో ఇబ్బందులు పడిన రైతులకు ఊరట కలిగింది. గ్రామీణ మార్కెట్ వలన మంచి ధరలతో పంటలను అమ్ముకునే అవకాశం ఉంటుందని, తద్వారా ప్రయోజనాలు ఎక్కువగా ఉంటాయని వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామీణ మార్కెట్ ద్వారా సుస్థిరత, ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని తక్కువ ఖర్చుతో రైతులకు మేలు జరుగుతుందని నాబార్డ్ అధికారులు చెబుతున్నారు.

గ్రామీణాభివృద్ధికి మైలు రాయి గ్రామీణ మార్కెట్



ఈ సంతల ద్వారా గ్రామీణ స్థాయిలో ఉత్పత్తులు మార్కెట్‌లోకి చేరడం, మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు దోహద పడుతుంది. ఈ సంతను పటిష్ఠంగా అమలు చేసేందుకు నాబార్డ్ నిర్వహణ కమిటీని ఎంపిక చేస్తుంది. వారి పర్యవేక్షణలో ఇక్కడ కార్యకలాపాలు సాగుతాయి. ఏన్నో దశాబ్దాలుగా భీమడోలు వాసులు పడుతున్న ఇబ్బందులకు చెక్ పడనుంది. అన్ని సదుపాయాలతో మార్కెట్‌ను నిర్మించడం చాలా సంతోషంగా ఉంది. ఇకపై ట్రాఫిక్ ఇబ్బందులు తీరతాయి.

–డాక్టర్ పాము మాన్‌సింగ్, చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు, భీమడోలు

రీసర్వే సకాలంలో పూర్తి చేయాలి



వీఆర్‌వోలతో సమావేశం నిర్వహిస్తున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: రీసర్వే గ్రామాల్లో సర్వే పనులు సకాలంలో పూర్తి చేయాలని దెందులూరు తహసీల్దార్ బి.సుమతి, వీఆర్‌వోలను ఆదేశించారు. గురువారం రామారావుగూడెం గ్రామంలో దెందులూరు మండలంలో సర్వే డిప్యూటీ తహసీల్దార్ రవిచంద్ర రీసర్వే వీఆర్‌వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ సీసీఎలే వీడియో కాన్ఫరెన్స్‌లో ఇచ్చిన సూచనలను వీఆర్‌ఓలకు వివరించారు. సర్వేలో అలసత్వం వహిస్తే జిల్లా అధికారులు తీసుకునే చర్యలకు బాధ్యులవుతారన్నారు. జవాబు దారితనంగా ఎటువంటి పొరపాట్లు లేకుండా రీసర్వే పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ హేమమాలిని, వీఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిరోధించాలి



నాటిక ప్రదర్శన చేస్తున్న కళాకారులు

ఉంగుటూరు: బాల్య వివాహాలు చేస్తే రక్త హీనతలు ఏర్పడతాయని, పిల్లలు బలిష్ఠంగా ఉండరని పలువురు వక్తలు అన్నారు. గురువారం ఉంగుటూరు హైస్కూల్‌లో బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై చైల్డ్ అడ్వకసీ ఫొరం సభ్యులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి హెచ్ఎం రవీంద్ర అధ్యక్షత వహించారు. శాంతి కల్చరల్ సొసైటీ కళాజాత బృందం వారు నాటిక ద్వారా విద్యార్థులకు బాల్య వివాహాల వలన కలిగే నష్టాలపై నాటిక ప్రదర్శనలు నిర్వహించారు. 1098కి ఫోన్ చేస్తే బాల్య వివాహాలను నివారించొచ్చని హెచ్ఎం తెలిపారు. కార్యక్రమంలో రేఖ, ఉపాధ్యాయులు పద్మ, సీహెచ్ శ్రీనివాసరావు, పీవీ కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు ఇప్పించండి మహాప్రభో..

- కాలువ పక్కనే ఉన్నా.. బోరు నీరు తాగుతున్నాం
- పల్లె పల్లెకు ధర్మరాజు కార్యక్రమంలో సమస్యలు ఏకరువు పెట్టిన ప్రజలు

ఉంగుటూరు: గ్రామాలు అభివృద్ధికి కట్టుబడి విజన్ 2047కు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గురువారం ఉంగుటూరు, నాచుగుంట, నీలాద్రిపురం, రావులపర్రు గ్రామాల్లో నిర్వహించిన పల్లెపల్లెకు ధర్మరాజు కార్యక్రమాల్లో ప్రజలు సమస్యలను ఏకరువు పెట్టారు. తల్లికి వందనం పడలేదని, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు ఇప్పించమని, పుంత రోడ్డు పోయిందని ఇలా పలు సమస్యలతో ప్రజలు ఎమ్మెల్యే ధర్మరాజుకు వినతి పత్రాలు అందజేశారు. ఉంగుటూరులో సర్పంచి బండారు సింధు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కొండ్రెడ్డి సర్వేశ్వరావు మాట్లాడుతూ గోదావరి కాలువ గట్టున మోటారు పెట్టి పైపులైను నిర్మిస్తే దానిని మూలన పెట్టి బోరు వాటర్ ఇస్తున్నారని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. అంతే కాకుండా పలు సమస్యలపై ప్రజలు ప్రజా ప్రతినిధులను నిలదీశారు. దీంతో ఎమ్మెల్యే ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామారావును వివరణ కోరారు. ఏఎంసీ మాజీ చైర్మన్ పాతూరి విజయకుమార్, ఉప సర్పంచి పాతూరి జగదీష్, ఈవోపీఆర్‌డీ చంద్రశేఖర్, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ సూరత్తుల అయ్యప్ప, నాయకులు పంది రాంబాబు, అడపా శోభారాణి, తహసీల్దార్ పూర్ణ చంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలి

బుట్టాయగూడెం: ముస్లింలు ఆర్థికంగా, సామాజికంగా అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని ముస్లింల జంగారెడ్డిగూడెం జేఏసీ సభ్యులు షేక్ ముస్తఫా తెలిపారు. బుట్టాయగూడెం మసీదులో గురువారం రాత్రి మసీదు పెద్దలతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ముస్లింలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో డిగ్రీ చదివిన వాళ్లలో ముస్లింలు మూడు శాతం మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉద్యోగాల్లో చాలా తక్కువ మంది ఉన్నారని చెప్పారు. రాజకీయంగా కూడా బాగా తక్కువ మంది ఉన్నారని వివరించారు. ప్రతి ముస్లిం తప్పనిసరిగా తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని కోరారు. కార్యక్రమంలో హిమామ్, బాజీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ముస్లింల అభివృద్ధి

జంగారెడ్డిగూడెం: ముస్లిం సమాజం అన్నిరంగాల్లో సమష్టిగా అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరూ విద్యనభ్యసించాలని స్థానిక ముస్లిం జేఏసీ సభ్యులు షేక్ ముస్తఫా అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం మసీద్‌లో లక్కవరం, దేవులపల్లి, రావికంపాడు, పంగిడిగూడెం మసీదు పెద్దలతో జేఏసీ సభ్యులు గురువారం సమావేశం లక్కవరం ఫరూఖీ మస్జిద్ అధ్యక్షులు పఠాన్ అన్వర్ భాష అధ్యక్షతన నిర్వహించారు. షేక్ నజీర్, షేక్ ముష్తాక్ అహ్మద్, షేక్ ఆదిల్ మాట్లాడారు.

మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు

- అదుపు తప్పితే అంతే సంగతులు
- కనీసం హెచ్చరిక బోర్డులు కూడా లేని వైనం
- రక్షణ కల్పించాలంటున్న ప్రయాణికులు



వంగూరు వద్ద ప్రమాదకరంగా మలుపు



కొండలరావులపాలెం వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు



లక్ష్మీపురం సమీపంలో అదుపుతప్పితే అంతే

పెదవేగి: నియోజకవర్గ వ్యాప్తంగా పలు గ్రామాలకు చెందిన మలుపులు ప్రమాదానికి నెలవుగా మారాయి. దీంతో ఈ రహదారులపై ప్రయాణించాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో నిత్యం ఈ రహదారి గుండా రాకపోకలు సాగించే ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. ఈ ప్రమాదకర మలుపులు ప్రధానంగా పెదవేగి మండల పరిధిలోని జానంపేట, లక్ష్మీపురం, కొండలరావులపాలెం, గార్లమడుగు, దెందులూరు మండలంలో శ్రీరామవరం, ఉండ్రాజవరం, దెందులూరు శివారు, రామారావుగూడెం, అలుగులగూడెం-సానిగూడెం రహదారుల్లో, పెదపాడు మండలంలోని కొత్తూరు, పాతముప్పర్రు, పెదపాడు, తోటగూడెం, సత్యవోలు, గుడిపాడు, తదితర గ్రామాల్లోని మలుపులు ప్రమాదకరంగా మారాయి. ఈ రహదారుల దగ్గర కొంత మంది అమాయకులు తీవ్రంగా గాయపడితే మరి కొందరు ప్రాణాలను కోల్పోతున్నారు. కనీసం ఈ ప్రమాదకర మలుపుల్లో హెచ్చరిక బోర్డును సైతం ఏర్పాటు చేయలేదని, ఈ రహదారుల్లో లో ప్రయాణం చేయాలంటే తమకు ముచ్చెమటలు పడుతున్నాయని, ఆయా మలుపుల వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు, బాధితులు అధికారులను కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

దెందులూరు: ఏలూరు మండలం చాటపర్రు సెక్షన్ పరిధిలో ఉన్న గుడివాకలంక సబ్‌స్టేషన్ మరమ్మతు పనుల నిమిత్తం ఈ నెల 18న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గుడివాకలంక, మొండికోడు, ప్రత్తికోళ్ల లంక, పైడిచింతపాడు, కొక్కిరాయిలంక, కోమటిలంక, పెదయాగనమిల్లి, చినయాగనమిల్లి పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని విద్యుత్ శాఖ ఏలూరు రూరల్ మండలం అసిస్టెంట్ ఇంజనీర్ నరసయ్య కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నరసాపురం: పట్టణంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల నరికివేత కారణంగా శుక్రవారం ఒక పూట విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు నరసాపురం ఎలక్ట్రికల్ ఈఈ మధుకుమార్ చెప్పారు. స్టీమర్ రోడ్డు, పంటరేవు, పొన్నపల్లి, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏరియా, టేలర్ హైస్కూల్ రోడ్డు, వైఎన్ కళాశాల రోడ్డు, పాతబజార్, పంజా సెంటర్, చర్చి రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని విజప్తి చేశారు.

పెదవేగిలో..

పెదవేగి: మండలంలోని పెదవేగి సెక్షన్ వేగివాడ సబ్‌స్టేషన్ పరిధిలో కె.కన్నాపురం, సీసీ పూడి ఫీడర్ల పరిధిలో కె.కన్నాపురం, బెత్తవారం గ్రామాల్లో చెట్ల కొమ్మలను తొలగించనున్నారు. పెదవేగి నుంచి కవ్వగుంట వెళ్లే లైన్‌లో కవ్వగుంట, జగన్నాథపురం, వెంకట కృష్ణాపురం, గార్లమడుగు, వంగూరు లక్ష్మీపురం గ్రామాల్లో చెట్ల కొమ్మలు తొలగించే నిమిత్తం ఈ నెల 18వ తేది శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేఎం అంబేడ్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. అదే విధంగా పెదవేగి మండలం విజయరాయి సెక్షన్ పరిధిలోని జానంపేట సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం జానంపేట, జగన్నాథపురం సింగవరం, ముత్తనవేడు, గ్రామాలకు ఈ నెల 18వ తేదీ శుక్రవారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఆయన తెలిపారు.

మనమిత్ర యాప్‌తో నీటితీరువా పన్నులు

దెందులూరు: మండలంలోని రైతులు నీటితీరువా పన్నులను మనమిత్ర వాట్సప్ యాప్ ద్వారా చెల్లించొచ్చని దెందులూరు మండల తహసీల్దార్ బి.సుమతి అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ రైతులు 9552309 నంబర్‌తో మనమిత్ర వాట్సప్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. నీటి తీరువా చార్జీలను వాట్సప్ యాప్ ద్వారా చెల్లించొచ్చన్నారు. మరిన్ని వివరాలకు తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని సుమతి కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

దెందులూరు: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత అధ్యక్షతన శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తామని ఎంపీడీవో కె.శ్రీదేవి తెలిపారు. అన్ని శాఖల మండల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు. ఎంపీటీసీలకు సమాచారం అందించామని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు టీవీలు అందజేత

ఉంగుటూరు: అంగన్‌వాడీ కేంద్రాలకు టీవీలను అందించే కార్యక్రమానికి నాచుగుంటలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు శ్రీకారం చుట్టారు. నియోజకవర్గంలోని 126 కేంద్రాలకు టీవీలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచి లక్ష్మీసునీత, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, యిమ్మని గంగాధరరావు, సీడీపీవో రాజశేఖర్ పర్యవేక్షకులు భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.